"దీన్ని అలుసుగా తీసుకుని నా దగ్గర పని చేసే వాళ్ళల్లో ఎవరైనా తప్పు చేస్తే తిట్టడం లాంటివేం చేయను. ఉద్యోగంలోంచి తీసేస్తానని వాళ్ళకి తెలుసు. అంచేత ఇక్కడ అజమాయిషీ లేకుండా పనిచేసే బాధ్యతని సక్రమంగా నిర్వర్తించే వాళ్ళే మిగులుతారు."

ఎవరైతే తమని అజమాయిషీ చేసేవారు లేకుండా కూడా చక్కగా, నిజాయితీగా పని చేస్తారో వాళ్ళు ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందుతారు.

## 94. మూడు ప్రవచనాలు

నసీరుద్దీన్ అంటే మన తెనాలి రామలింగడు లాంటివాడు అనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కాని అతను గొప్ప ఆధ్యాత్మికవేత్త. ఓ సారి నసీరుద్దీన్‌ని కొందరు ధార్మిక ఉపన్యాసాన్ని ఇవ్వమని కోరారు. నసీరుద్దీన్ వేదికని ఎక్కి అడిగాడు.

"ప్రజలారా! నేనేం చెప్పబోతున్నానో మీకు తెలుసా?"

"లేదు. మాకు తెలీదు." చెప్పారు వారు.

"కొద్దిగా అయినా విషయం తెలీకపోతే నేను చెప్పేది మీకు అర్థం కాదు." నసీరుద్దీన్ వెళ్ళిపోయాడు.

మళ్ళీ వారం తర్వాత ఆ సాధువు దగ్గరికి వచ్చి ఆధ్యాత్మికత గురించి కొంత తెలుసుకున్నామని, వచ్చి ప్రవచనం చెప్పమని వారు కోరారు. నసీరుద్దీన్ ఒప్పుకున్నాడు.

వేదికని ఎక్కాక నసీరుద్దీన్ అడిగాడు.

"ప్రజలారా! నేనేం చెప్పబోతున్నానో మీకు తెలుసా?"

"తెలుసు." ముక్త కంఠంతో జవాబు చెప్పారు సభికులు.

"తెలిసాక ఇంక నేను మీకు చెప్పడానికి ఏం ఉంది?" వెళ్ళిపోయాడతను.

మరో వారం తర్వాత మళ్ళీ నసీరుద్దీన్ దగ్గరకి వెళ్ళి ప్రవచనం చెప్పడానికి రమ్మని కోరారు వాళ్ళు. సరేనన్నాడు అతను.

వేదికని అలంకరించాక అడిగాడు నసీరుద్దీన్.

"ప్రజలారా! నేనేం చెప్పబోతున్నానో మీకు తెలుసా?"

"కొందరికి తెలుసు, కొందరికి తెలీదు." జవాబు చెప్పారు ప్రజలు.

"సరే అయితే. ఎవరికైతే తెలుసో వారు తెలీని వాళ్ళకి చెప్పండి." అని నసీరుద్దీన్ వేదిక దిగి వెళ్ళిపోయాడు.

ఇతరులని ఉద్ధరించాలనుకుని ప్రవచనాలతో సమయాన్ని వృధా చేసుకోకుండా, దైవ ధ్యానం చేసుకుంటూ ఎవరిని వారు ఉద్ధరించుకోవాలని నసీరుద్దీన్ ఇలా అనేక చర్యల ద్వారా సదా చెప్పేవాడు.

## 95. బానిస- భక్తుడు

దైవ భక్తి పరుడైన ఓ ధనవంతుడు ఓ బానిసని కొనుక్కున్నాడు. అతన్ని ఇంటికి తెచ్చాక అడిగాడు.

"నీ పేరేమిటి?"

"మీరు ఏ పేరుతో పిలిస్తే నా పేరు అదే దొర." వినయంగా జవాబు చెప్పాడు ఆ బానిస.

"నువ్వు రోజూ ఏం తింటావు?" అడిగాడు మళ్ళీ.

"మీరేం పెడితే అదే తింటాను దొరా."

"నీకు ఎలాంటి దుస్తులు ధరించాలని కోరికగా ఉంటుంది?"

"మీరేం దుస్తులు ఇస్తే వాటినే ధరించాలని ఉంటుంది దొర."

"సరే. నువ్వేం పని చేస్తావు?"

"మీరేం పని చెప్తే అది చేస్తాను దొర."

"సరే. నీకేమైనా కోరిక ఉంటే చెప్పు. అది నేను తీరుస్తానని మాట ఇస్తున్నాను." అడిగాడు ధనవంతుడు.

తనని బానసత్వం నించి విముక్తి చేయమని కోరతాడనుకుని ఎదురు చూసిన అతనికి, ఆ బానిస ఎదురు ప్రశ్న విని ఆశ్చర్యం కలిగింది.

"బానిసకి కోరికంటూ ఉంటుందా దొరా?"

వెంటనే ఆ ధనవంతుడు ఆ బానిసని కౌగలించుకుని చెప్పాడు.